ఈనాడు
epaper.eenadu.net

## మెట్రోలో అత్యాధునికంగా

# డిజిటల్ టికెటింగ్

### త్వరలో ఈ-పాస్‌లు అందుబాటులోకి



డిజిటల్ టికెటింగ్ ఆవిష్కరణలో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సీటీవో మురళీ వరదరాజన్, సీవోవో సుధీర్, బిల్ఈజీ సీఈవో ఆకాశ్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటిసారిగా హైదరాబాద్ మెట్రోరైలులో డిజిటల్ టికెట్ విధానాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ, రూట్ మొబైల్, బిల్ ఈజీతో కలిసి గూగుల్ రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్(ఆర్సీఎస్) ఆధారిత ఆధునిక డిజిటల్ టికెట్ సేవలను ప్రవేశపెట్టింది. కొండాపూర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ సేవలను హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైలు సీవోవో సుధీర్ చిప్లుంకర్, రూట్ మొబైల్ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు సుమిత్ జవార్, బిల్‌ఈజీ సీఈవో ఆకాశ్‌పాటిల్‌తో కలిసి లాంఛనగా ప్రారంభించారు.




జేబులో వాలెట్ అవసరం లేకుండా మొబైల్‌లోనే గూగుల్ వాలెట్ ఆర్సీఎస్ ఆధారంగా టికెట్ బుక్ చేసుకోవచ్చని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే డిజిటల్ పాస్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. అప్పుడు కార్డులతోనూ పని ఉండదన్నారు. బహుశా ప్రపంచంలోనే ఈ తరహా సేవలు ఇవే మొదటివి అని అన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నాలుగు రైళ్లు కావాలని నాగ్‌పూర్ మెట్రోని కోరామని.. త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. మెట్రోలో సాంకేతిక సమస్యలతో కొన్ని నిమిషాలు సేవలు నిల్చిపోవడం సహజమని తెలిపారు. లాంఛనంగా ప్రారంభించిన డిజిటల్ టికెటింగ్ విధానం రెండువారాల్లో అందుబాటులోకి వస్తుందని నిర్వాహకులు తెలిపారు. స్టేషన్ వద్ద క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి వాలెట్‌లో టికెట్ పొందవచ్చని తెలిపారు. టికెట్ కౌంటర్లవద్ద నిరీక్షణ తప్పుతుందన్నారు. గూగుల్ ఆర్సీఎస్ సాంకేతికత ఆధారంగా పనిచేసే వాలెట్‌తో మెట్రో ప్రయాణటికెట్లు, అన్ని రకాల కార్డులు, విమాన బోర్డింగ్ పాస్‌లు, రియల్‌టైమ్ సమాచారం, వాహనాలు, ఇంటిడిజిటల్ తాళాలవరకు వినియోగించుకోవచ్చని గూగుల్ వాలెట్ ప్రతినిధి తెలిపారు.

Date : 06/11/2024 EditionName : GREATER HYDERABAD PageNo :